# పదండి ముందుకు

మా అరుణ వివాహ సందర్భంగా. హైద్రాబాద్ వెళ్ళి పదిరోజులు వున్నాను. నేను పెళ్ళి హడావిడిలో వుండగానే సూరి ఫోన్ చేశాడు.

ఆయన అమెరికాలో ఇంజనీరింగ్‌లో ఎం.ఎస్., ఎం.బి.ఏ. చదివి, అటు ఆటో ఇండస్ట్రీలోనూ, ఇటు సెమీకండక్టర్ ఇండస్ట్రీలోనూ దాదాపు పన్నెండేళ్ళు పనిచేసి ఇండియాకి తిరిగివెళ్ళిపోయాడు. ఆయనకీ, ఆవిడకీ మొట్టమొదటినించీ ఇండియాకి వెళ్ళిపోవాలనే గట్టి పట్టుదల. పిల్లలు స్కూల్లో చదువులకి వచ్చేలోగానే వెళ్ళమనే. అప్పుడు వెళ్ళకపోతె పిల్లలు ఈ రెండు స్కూల్ కల్చర్లకీ మధ్య నలిగిపోతారనీ, తిరిగి వెళ్ళటం చాల కష్టమనీ గట్టిగా చెప్పాను. ఆయన కూడా అర్థం చేసుకుని అలాగే తన తిరుగు ప్రయాణం ప్లాన్ చేసుకున్నాడు. చివరికి ఒకటిన్నర సంవత్సరాల క్రితమే ఇండియాకి తిరిగి వెళ్ళిపోయాడు.

"ఏమండీ! బాగున్నారా? ఎలా జరిగింది ప్రయాణం. ఆస్టిన్‌లో మన వాళ్ళందరూ బాగున్నారా?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించాడు.

అన్నిటికీ జవాబు చెప్పి, "ఎలావుంది ఇండియాలో మీ మరో జన్మ.. పిల్లలు, సుందరీ బాగున్నారా?" అడిగాను.

"అన్నీ తీరిగ్గా చెబుతాను.. మీ ప్రోగ్రాం ఏమిటి?.. ఎప్పుడు కలుద్దాం."

"ఎప్పుడైనా ఫరవాలేదు. నాకిక్కడ ఉద్యోగం లేదుగా మరి" నవ్వాను.

"అయితే ఫలానా రోజు వస్తాం. మా ఇల్లు చాల దూరం. కనుక నేనే వస్తాలెండి" అన్నాడు. మంచివాడు కనుక మాఇంటికి వాళ్ళిల్లు ఎంత దూరమో, వాళ్ళింటికి మా ఇల్లూ అంతే దూరమని మర్చిపోయాడు.

అప్పుడే వచ్చాడు పక్కింటి పార్థసారథి. "మీ కథలు చదివాను. ఎన్నారై కబుర్లు ముఖ్యంగా. కొన్ని నచ్చాయి" అన్నాడు.

నేను నవ్వి "అంటే కొన్ని నచ్చలేదన్నమాట" అన్నాను. పపాసా ఒక క్షణం ఆలోచించి "నచ్చలేదంటే కారణం వుంది. మీరు రెండు కోణాలనించీ చూడటం సబబైనా, మన దేశ రాజకీయ, సాంస్కృతిక, సాంఘిక పరిస్థితుల దృష్ట్యా అమెరికాని ఇంకొంచెం పరిశీలనగా చూస్తే బాగుండుననిపించింది" అన్నాడు.

"అంటే.." అడిగాను ఆయన చెప్పింది లీలగా అర్థమయినా కూడా.

"అంటే అమెరికా ఇండియాని కాదని, పాకిస్తాన్ వేపు మొగ్గు చూపుతున్నది. ప్రెసిడెంట్ బుష్ అన్యాయంగా ఇరాక్‌మీద యుద్ధంచేస్తున్నాడు. అమెరికా కమ్యూనిస్టు చైనాతో వ్యాపారం చేస్తున్నది వీటి గురించి మీరు ఏమి వ్రాయకుండా దాటేస్తున్నారు.."

సాలోచనగా చిన్నగా నవ్వాను. "దానికి రెండు కారణాలు వున్నాయి. పేపర్‌లో వచ్చే వార్తల గురించి నేను వ్రాయాల్సిన పనిలేదు. అదీకాక అనవసరపు వాదనలని రెచ్చగొట్టే విషయాలు వదులుకున్నాను. రెండవది, ఏ విషయమైనా మీరు ఎటువైపు నించి చూస్తున్నారన్నదాన్ని బట్టి వుంటుంది. మనలోని ఉద్రి

క్తత (ఎమోషన్) తర్కానికి అందనంత దూరంగా తరిమేస్తుంది. అలాటప్పుడు రెండు వాదాలూ రైలు పట్టాలలాగా ఎక్కడా కలవకుండా పోతుంటాయి. దాని వల్ల ఏమీ లాభం లేదని నా ఉద్దేశ్యం" అన్నాను.

"మీరలాటివి తీసుకుని రెండు పక్కలనించీ చూపించవచ్చు కదా.... "

"చూపించవచ్చు" అన్నాను. ఆయనకి అవును వ్రాస్తానన్నానో చూపించవచ్చని హైపోథిటికల్‌గా అన్నానో అర్థమయినట్టు లేదు.

తర్వాత నాలుగు రోజులకి వచ్చాడు సూరి. "ఏదో పని మీద వెళ్ళి, స్కూటర్ మీద అట్నించీ ఇటు వచ్చాను... " అన్నాడు.

"ఇక్కడెలావుంది... జాబ్ దొరకలేదన్నారు కదా... " అడిగాను.

"అవును. ముందు ఇక్కడా, తర్వాత బెంగుళూరులోనూ ప్రయత్నం చేశాను. బెంగుళూర్‌లో సాఫ్ట్‌వేర్‌వాళ్ళకి బాగానేవుంది కానీ నాలాటి మెకానికల్ ఇంజనీర్లకి ఏమీలేదు... నా ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, సప్లై చైన్ మేనేజ్‌మెంట్, కాస్ట రిడక్షన్‌లాటి వాటికి పెద్ద అవకాశాలు లేవు... "

"మరేం చేద్దామని... " అడిగాను.

సూరి నవ్వాడు- "ఇక్కడే ఇండియాలోనే వుండి పోవాలనే ధృఢనిశ్చయంతో తిరిగి వచ్చేశాం మేము. ఇక వెనక్కి వెళ్ళే ప్రశ్నే లేదు. మళ్ళీ టెంప్ట్ అవకుండా గ్రీన్ కార్డు కూడా వదిలేసుకున్నాం"

ఆయన పట్టుదలా, ఓర్పు గురించి నాకు బాగా తెలుసు. అమెరికాలో చిన్న వయసులోనే, చకచకా ముందుకి పోవటానికి ఆ లక్షణాలే ఆయనకి ఉపయోగపడ్డాయి. కొంచెం ఆలస్యమవుతుంది కానీ ఇక్కడా ఏదో దొరక్కపోదు.

"నేనూ వూరికే కూర్చోలేదు లెండి. కన్సల్టింగ్ మొదలుపెట్టాను. పెద్ద ఆదాయం లేకపోయినా, అవకాశాలున్నాయి. నేనక్కడ వున్నప్పుడే అమెరికాలో ఔట్ సోర్సింగ్ మొదలయింది. మీరూ చైనా, తైవాన్, కొరియా, సింగపూర్, మలైషియాలాటి దేశాలకి ఆ పని మీదే వెళ్ళారు కదా. ఇప్పటి దాకా సాఫ్ట్‌వేర్ మీదే ఇండియా దృష్టి వున్నా, ఇప్పుడిప్పుడే మిగతా వాటి గురించి ఆలోచిస్తున్నారిక్కడ. ఈ విషయంలో ఏదయినా చేయాలని వుంది. కాకపోతే ఆ క్వాలిటీ మైన్‌టైన్ చేయటంలోనే వుంది భవిష్యత్తంతా... "

"అవును. అమెరికాకి కావలసింది నాలుగు. ఒకటి ధర. రెండవది నాణ్యత. మూడవది సమయానికి అందజేయటం. నాలుగవది కస్టమర్ సర్వీస్. ఈ నాలుగు ఏ దేశం వాళ్ళు ఇస్తే అక్కడికే వెడతారు అమెరికన్ కంపెనీలు. నా వల్ల ఏమన్నా సహాయం కావాలంటే చెప్పండి. నేను చేయగలిగితే సరే. లేకపోతే అక్కడ మనవాళ్ళకెవరికైనా ఉత్సాహం వుందేమో చూద్దాం.... " అన్నాను.

"ఐ యామ్ కమిటెడ్... అండ్ పర్సిస్టెంట్.... " అన్నాడు.

"మీరు చేయగలరు. నాకు తెలుసు... పదండి ముందుకు... " అన్నాను ధైర్యం చెబుతూ.

* * *